## నేటి నుంచి ఇంటర్ ప్రయోగ పరీక్షలు

అశ్వారావుపేట, ఫిబ్రవరి 10: ఇంటర్ మూడో దశ ప్రవేశ పరీక్షలు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సాగర్ తెలిపారు. అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. స్థానిక జూనియర్ కళాశాలలో శనివారం ప్రయోగ పరీక్షల వివరాలను వెల్లడించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు దఫాలుగా ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

## నెంబర్‌ప్లేట్ సరిగాలేని వాహనదారులపై చర్యలు

భద్రాచలం, ఫిబ్రవరి 10: నెంబర్‌ప్లేట్ సరిగా లేని వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్, ఎంవీఐ తిరుపతి హెచ్చరించారు. శనివారం స్థానిక బ్రిడ్జి సెంటర్‌లో వాహనాల తనిఖీ చేపట్టి రోడ్డు భద్రతా వారోత్సవాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ తనిఖీల్లో ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారిపై కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్ ఏఎస్సై వెంకన్న, పోలీసులు, వాహనదారులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు సర్వీసులు పెంచండి

చంద్రుగొండ, ఫిబ్రవరి 10: ఆర్టీసీ బస్సు సర్వీసులు పెంచాలని సీపీఎం మండల నాయకులు రాయి రాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం చంద్రుగొండలోని అంబేద్కర్ కాలనీ వాసులు బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ, ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు.

## 'బడ్జెట్‌లో మైనార్టీల సంక్షేమానికి మొండిచేయి'

రామవరం, ఫిబ్రవరి 10: తెలంగాణ అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి శనివారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి మొండిచేయి చూపారని మైనార్టీ సంఘం జిల్లా అధ్యక్షుడు యాకూబ్‌పాషా శనివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రూ.2,262 కోట్లను మాత్రమే కేటాయించి మైనార్టీలను నిరాశకు గురి చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని మైనార్టీలు అభివృద్ధి చెందుతారని ఆశించిన తమకు నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఘనంగా నందులచెలక జాతర

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 10: మండల పరిధిలోని నందులచెలకలో ఆదివాసీల ఇలవేల్పు జాతరను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ తెగల సమన్వయకర్త, ఆదివాసీ కోయ పుణ్యం ధర్మప్రచారక్ ఆధ్వర్యంలో శతాబ్దకాలం తర్వాత ఆదివాసీ ఇలవేల్పుల పారేడు గట్టు మూలంబరాలు చేరడంతో జాతర నిర్వహించారు. కోటేశ్వరరావు, పాపారావు, కామయ్య, చిట్టిబాబు, సీతమ్మ, భద్రమ్మ, గణేష్ జాతర ఏర్పాట్లు చూసినట్లు ఆదివాసీ తెగల సమన్వయకర్త కన్నారాజు తెలిపారు. జాతరలో ఆదివాసీలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు పుస్తకాల అందజేత

పాల్వంచ, ఫిబ్రవరి 10: పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాతీయ సవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో 'పిల్లల కోసం' అనే కార్యక్రమం ఏర్పాటు చేశారు. డీఈవో వెంకటేశ్వరచారి పాల్గొని ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు పుస్తకాలు, బ్యాడ్జీలు అందజేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వనజ, కో ఆర్డినేటర్ పూర్ణచందర్‌రావు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి పీఆర్‌వోకు సీపీఆర్‌వో అభినందన


అభినందనలు తెలుపుతున్న సీపీఆర్‌వో సురేశ్

కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 10: సింగరేణి పీఆర్‌వో శ్రీరాముల శ్రీకాంత్‌కు నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. 'రోల్ ఆఫ్ సోషల్ మీడియా ఇన్ సోషల్ అండ్ పొలిటికల్ మూవ్‌మెంట్స్ – ఏ కేస్ స్టడీ ఆఫ్ తెలంగాణ మూవ్‌మెంట్' అనే అంశంపై ఇఫ్లూ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజారాం పర్యవేక్షణలో శ్రీకాంత్ పరిశోధన చేశారు. ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా ఉస్మానియాకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సతీశ్ వ్యవహరించారు. కాగా, డాక్టరేట్‌ను పొందిన శ్రీకాంత్‌ను హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సీపీఆర్వో సురేశ్ అభినందించారు.

## 'తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు'

రామవరం, ఫిబ్రవరి 10: వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి మనోహర్ స్పష్టం చేశారు. సింగరేణి కార్మిక ప్రాంతమైన రుద్రంపూర్ మార్కెట్ సెంటర్‌లో శనివారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు దుకాణాల యజమానులతో ఆయన మాట్లాడుతూ.. తూకాల్లో వ్యాపారులు మోసాలకు పాల్పడవద్దని సూచించారు. అలాగే, వినియోగదారులు కూడా తాము వస్తువులు కొనుగోలు చేస్తున్నప్పుడు అవి సరైన తూకంలో ఉన్నాయో లేవో సరిచూసుకోవాలని సూచించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

**CHANGE OF**

★I, **DHASYAM MEHER KRANTHI** CHANGED MY NAME AS **CHAGANTI MEHER KRANTHI** W/O. DHASYAM MADHU BABU R/O. Q.NO. ADE-58, C COLONY, KTPS, PALVANCHA-507115, BK DIST.
Kmm

**మద్యం (ఆల్కహాల్) మాన్పించబడును**



★త్రాగుడు (ఆల్కహాల్) & సిగరెట్, గుట్కా మానండి, మాన్పించండి. త్రాగేవారికి తెలియకుండా ఆయుర్వేద మందుతో మాన్పించవచ్చు. సైడ్ ఎఫెక్ట్స్ లేవు. కేంద్రీయ ఆయుర్వేద. ఫోన్: 9652899899.
NT-319957

**COMMERCIAL FOR SALE**

★సికింద్రాబాద్, S.D. రోడ్, స్వప్నలోక్-సూర్యకిరణ్ కాంప్లెక్స్, 500 Sft., ఆఫీస్/గోడౌన్, 5వ అంతస్తు, సపరేట్ బాత్‌రూమ్, లిఫ్ట్/పార్కింగ్ కలిగిన కమర్షియల్ స్పేస్ అమ్మకం కొరకు కలదు. సెల్: 9246242210.
NT-319436

**ప్లాట్లు కొనబడును**



★హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, పసుమాముల, రామోజీ, కోహెడ, సాగర్ పంపు, గుంతపల్లి, బాటసింగారం, తూప్రాన్‌పేట్, మల్కాపురం, పోచంపల్లిలో ప్లాట్లు కొనబడును. J.సుధాకర్ గౌడ్: 9948172307, 9390846522.
NT-313886

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ



నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

డంపింగ్ యార్డుగా మారుస్తున్న వ్యాపారస్తులు
పట్టించుకోని అధికారులు..

# చెరువా.. చెత్తకుండీనా?


చెరువులో పడేసిన వ్యర్థాలని, చెత్తను చూపిస్తున్న యువకుడు

చంద్రుగొండ, ఫిబ్రవరి 10: మండల కేంద్రంలోని శనగచెరువు డంపింగ్‌యార్డుగా మారుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 100 ఏళ్ల చరిత్ర కలిగిన శనగచెరువుకు 150 ఎకరాల ఆకట్టు ఉన్నది. ఈ చెరువు కింద వానకాలంలో పూర్తిస్థాయిలో పంటలు పండగా, యాసంగిలో 40 ఎకరాలకు పైగా సాగవుతోంది. కాగా గత కొద్ది నెలలుగా చంద్రుగొండ ప్రధాన సెంటర్‌లోని వ్యాపారాలు నిర్వహిస్తున్న యజమానులు వారి షాపుల్లోని చెత్తా, చెదారం, చికెన్ వ్యర్థాలు వంటివి తీసుకువచ్చి చెరువుకట్టపై పోసి వెళ్తున్నారు. దీంతో అవి గాలికి చెరువులో కలిసి కలుషితమవుతున్నాయి. కొద్దిరోజులకు అవి దుర్గంధం వెద్దజల్లుతోంది. దీంతో ఆ దారిలో ప్రయాణించాలంటే ముక్కు మూసుకోవాల్సిందే అంటూ వాహనదారులు అంటున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా వ్యర్థాలను తీసుకువచ్చి ఇక్కడ పోస్తున్నా పంచాయతీ అధికారులు, ఇరిగేషన్ అధికారులూ పట్టించుకోవడం లేదంటూ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై గ్రామస్తులు, యువకులు పంచాయతీ పాలకులకు పలు మార్లు విన్నివించినా పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలు జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డంగింగ్‌యార్డుగా మార్చిన దుకాణ దారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, చెరువు ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

# ప్రజాపాలన దరఖాస్తుల విచారణ


గుండాలలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీవో

ఆళ్ళపల్లి/గుండాల, ఫిబ్రవరి 10: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా రెండ్రోజులుగా 'మహాలక్ష్మి' పథకానికి సంబంధించి గ్యాస్ ఆన్‌లైన్ విధానం, విద్యుత్ మీటర్ వివరాలను అధికారులు డోర్ టు డోర్ సర్వే చేస్తున్నారు. శనివారం ఆళ్ళపల్లి, గుండాల మండలాల్లో జరుగుతున్న సర్వేను కొత్తగూడెం ఆర్డీవో ఆర్.శిరీష పరిశీలించారు.

పినపాక, ఫిబ్రవరి 10 : ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజలు అందజేసిన దరఖాస్తుల విచారణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని పినపాక ఎంపీడీవో చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. శనివారం దరఖాస్తుల విచారణను పరిశీలించి మాట్లాడారు.

అశ్వారావుపేట, ఫిబ్రవరి 10 : కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీ పథకాల కోసం ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను శనివారం నుంచి అధికారుల ఇంటింటి పరిశీలన ప్రారంభమైంది. మేజర్ పంచాయతీ పరిధిలో ఈవో హరికృష్ణ నేతృత్వంలో నాలుగు బృందాలు దరఖాస్తు వివరాలను తనిఖీ చేస్తున్నారు.

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 10: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలు కోసం గ్రామాల్లో ముమ్మరంగా సర్వే జరుగుతోంది. సుజాతనగర్‌లో గ్యారెంటీ హామీల పెండింగ్ దరఖాస్తుల విచారణను మండల ప్రత్యేకాధికారి త్రినాథ్‌బాబు, ఎంపీడీవో వెంకటలక్ష్మి శనివారం పరిశీలించారు.

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 10: మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డు కూలీలైన్‌లో రూ.500కే గ్యాస్ పొందేందుకు దరఖాస్తు చేస్తున్న అర్జీదారుల ఇళ్ల వద్ద అధికారులు శనివారం విచారణ చేపట్టారు.

## నాటిన ప్రతిమొక్కను సంరక్షించాలి :తహసీల్దార్

పినపాక, ఫిబ్రవరి10: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరితహారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయని, నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని తహసీల్దార్ వీరభద్రప్రసాద్ అధికారులకు సూచించారు. శనివారం మండలంలోని పాతరెడ్డిపాలెం గ్రామంలోని అవెన్యూ ప్లాంటేషన్‌ను ఫారెస్ట్ రేంజి అధికారి తేజస్వినితో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## 'చిన్నారుల భవిష్యత్తుకు తోడ్పాటునందిస్తాం'

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 10: గుండెపోటుతో మరణించిన ఆటో డ్రైవర్ రాజు కుటుంబానికి అండగా ఉంటామని, అతడి పిల్లల భవిష్యత్తుకు తోడ్పాటునందిస్తామని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని హమాలీకాలనీలో నివాసముంటున్న కారింగుల రాజు (33) ఇటీవల గుండెపోటుతో మరణించాడని అన్నారు. మెపా డోనర్స్ సాయంతో రూ.57 వేలను సేకరించి రాజు కుమార్తెల పేరు మీద పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశామని, ఆ పాస్‌బుక్‌ను బాధితులకు శుక్రవారం రాత్రి అందించామని తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ


రామన్నగూడెంలో ర్యాలీ

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 10: మండలంలోని రామన్నగూడెంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు శనివారం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. జీవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీల్లో రిసోర్స్‌పర్సన్ వెంకటేశ్వరరావు మాట్లాడారు. ప్రకృతిలో లభించే వనరులతో చేసేదే ప్రకృతి వ్యవసాయమన్నారు. ఒక గోవు ద్వార 10 ఎకరాల వ్యవసాయం పెట్టుబడి లేకుండా చేయవచ్చన్నారు. మేకలు తినని చెట్లు ఆకుల నుంచి కషాయాలు తయారు చేసి పంటలకు పిచికారీ చేయడం వల్ల మొక్కలు పెరుగుదల, చీడ, పీడలు ధరిచేరవని అన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై గర్భిణులకు, తల్లులకు ఈపీఆర్‌పీ మేరీమణి అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు రాములు, లక్ష్మి, జీపీ కార్యదర్శి ప్రశాంత్, ఎఎన్ఎం విజయకుమారి, అంగన్‌వాడీ టీచర్ సుజాత, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కొత్తగూడెం క్రైం, ఫిబ్రవరి 10: రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం చెందిన ఘటన కొత్తగూడెం పట్టణంలో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం ముస్తాఫానగర్‌కి చెందిన చల్లా ఉమా చిన్న కుమారుడు చల్లా దుర్గా ప్రసాద్ (17) ఐటీఐ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇదిలా ఉండగా, చంద్రుగొండ మండలానికి చెందిన తన స్నేహితురాలు చనిపోయిందని, తన అంత్యక్రియలకు వెళ్లి వస్తానని చెప్పిన దుర్గాప్రసాద్.. తెల్లవారుజామున యాక్టీవా ద్విచక్ర వాహనంపై ఖమ్మం నుంచి బయలుదేరాడు. ఈ క్రమంలో కొత్తగూడేనికి చేరుకోగానే సింగరేణి ఉమెన్స్ కళాశాల సమీపంలో దుర్గాప్రసాద్ వాహనం అదుపుతప్పింది. డివైడర్ మధ్యగల చెట్టుకి అతడి తల బలంగా తగలడంతో అది పూర్తిగా చితికిపోయింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. వన్‌టౌన్ ఎస్సై విజయ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితులను పరిశీలించారు. అనంతరం మృతుడి వివరాలను ఆరాతీసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని కొత్తగూడెం జిల్లా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి తల్లి ఉమ అక్కడికి చేరుకున్నాక పోస్టుమార్టం చేసిన దుర్గాప్రసాద్ మృతదేహాన్ని పోలీసులు ఆమెకు అప్పగించారు. చేతికందివచ్చిన కుమారుడు అకస్మాత్తుగా మృతిచెందడంతో ఆ తల్లి రోదనలు మిన్నంటాయి. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రామభక్తులకు ఘనస్వాగతం

అశ్వారావుపేట, ఫిబ్రవరి 10: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ నుంచి భద్రాచలం సీతారాముల దర్శనానికి బయలుదేరిన రామభక్తులు శుక్రవారం రాత్రి అశ్వారావుపేట చేరుకున్నారు. స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో రాత్రి బస చేశారు. వీరికి వాసవీ క్లబ్ బాధ్యులు ముత్తా సుమాకర్, దేవరాజ్‌కు శనివారం ఉదయం అల్పాహారం, తేనేటి విందు ఏర్పాటు చేశారు. తిరిగి భద్రాచలానికి రామభక్తులు బయలుదేరి వెళ్లారు.

## తాగునీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 10: రానున్న వేసవిలో మండలంలోని పంచాయతీలలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని ఎంపీడీవో బాలరాజు అన్నారు. శనివారం బొజ్జాయిగూడెం, సుదిమల్ల, కొమ్ముగూడెం పంచాయతీలలో ప్రత్యేక పారిశుధ్య పనులు, ప్రజాపాలన అప్లికేషన్లలో గ్యాస్ కన్జ్యూమర్ నెంబర్ల నమోదు ప్రక్రియను పర్యవేక్షించారు.

## గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడాలి

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 10 : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడాలని ఎంపీడీవో అన్నపూర్ణ అన్నారు. శనివారం మండలంలోని మర్రిగూడెం పంచాయతీలో పారిశుధ్యం పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో చెత్తాచెదారం లేకుండ డంపింగ్ యార్డులకు తరలించాలని, పిచ్చి మొక్కలను తొలిగించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 10 : పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా శనివారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో మురుగు గుంతలను పూడ్చివేశారు. ఆసుపాకలోని అంగన్‌వాడీ-2 కేంద్రం వద్ద ఏర్పడిన గుంతల్లో మట్టిపోశారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలలు, సబ్ సెంటర్‌లు, గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద గుంతలను పూడ్చివేశారు. పారిశుధ్య కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని స్పెషల్ ఆఫీసర్లు పిలుపునిచ్చారు.

## ఇసుక రవాణాకు అడ్డుకట్ట

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 10 : దుమ్ముగూడెం మండలంలో ఇసుక అక్రమ రవాణాకు రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేశారు. శనివారం మండల కేంద్రమైన లక్ష్మీనగరం ఇసుక ర్యాంపు వద్ద ఆర్ఐ ఆదినారాయణ జేసీబీ సాయంతో ట్రంచ్ కొట్టించారు. ఇసుకను రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నిలువెత్తు బంగారంతో మేడారం జాతరకు..


ఎత్తు బంగారాన్ని (బెల్లం) వేయిస్తున్న భక్తులు

రామవరం, ఫిబ్రవరి 10: మేడారంలో రెండేళ్లకోసారి జరిగే సమ్మక్క, సారలమ్మ జాతరకు సమయం సమీపిస్తుండడంతో భక్తులు బిజీబిజీ అవుతున్నారు. కోర్కెలు నెరవేర్చిన తల్లులకు అత్యంత ఇష్టమైన బంగారాన్ని (బెల్లం) సమర్పించేందుకు ముమ్మరంగా కొనుగోళ్లు జరుపుతున్నారు. రామవరం పరిసర ప్రాంతాల్లో ఏ దుకాణంలో చూసినా అమ్మవార్లకు సమర్పించేందుకు వారికి ప్రీతిపాత్రమైన బంగారం (బెల్లం)తో నిలువెత్తు తూకాలు వేస్తున్న దృశ్యాలే కన్పిస్తున్నాయి.గీ నెల 21 నుంచి 24 వరకు మహాజాతర జరుగనున్నప్పటికీ కొందరు భక్తులు ఇప్పటి నుంచే మేడారానికి వెళ్లి వస్తున్నారు.

## నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేద్దాం: సింగరేణి జీఎం

రామవరం, ఫిబ్రవరి 10: నాణ్యతతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేద్దామని, అదే నాణ్యతతో వినియోగదారులకు అందిద్దామని సింగరేణి ఏరియా జీఎం శాలెంరాజు పేర్కొన్నారు. నాణ్యమైన బొగ్గును రవాణా చేసి సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను రక్షణతో అధిగమిద్దామని, సంస్థ అభివృద్ధికి తోడ్పడదామని అన్నారు. సింగరేణి సీఎండీ బలరాం ఆదేశాల మేరకు డిపార్ట్‌మెంట్లు, జీఎం కార్యాలయాల్లో మల్టీ డిపార్ట్‌మెంట్ బృందాలతో ఏరియా జీఎం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి ఏరియా అధికారులు కోటిరెడ్డి, హనాసుమలత, యోహాన్, శివకేశవరావు, కరీముల్లా, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఏఎన్ఎం సుశీలకు మరో అరుదైన అవార్డు

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 10: జిల్లాలోని ఎర్రగుంట పీహెచ్‌సీలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న జిల్లావాసి తేజావత్ సుశీలకు మరో అరుదైన గౌరవం దక్కింది. నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డును ఆమె అందుకున్నారు. డే స్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ బ్రాంచిలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆమెకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

**సంక్షిప్తం**

### పాత సామన్ల అప్పగింత

భద్రాచలం, ఫిబ్రవరి 10: భద్రాచలం ఐటీడీఏలో పనికిరాని(స్క్రాప్) పాత సామాన్లను వేలంపాటలో హెచ్చు ధర కోట్ చేసిన వ్యక్తికి శనివారం అప్పగించినట్లు ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్ తెలిపారు. ఖమ్మానికి చెందిన పాషా టెండర్ పాడుకున్నట్లు పేర్కొన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఐటీడీఏ ఏవో భీమ్, ఆర్‌సీవో వెంకటేశ్వరరాజు, ఏసీఎంవో రమణయ్య పాల్గొన్నారు.

### పశువులను తరలిస్తున్న వ్యక్తులపై కేసు

కరకగూడెం, ఫిబ్రవరి 10: అక్రమంగా తరలిస్తున్న పశువు(గోవు)లను మండల పరిధిలోని లక్ష్మీపురం శివారులో ఎస్సై రాజారాం తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని పశువులను పాల్వంచ గోశాలకు తరలించారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఓపెన్ పరీక్ష ఫీజు గడువు పెంపు

జూలూరుపాడు, ఫిబ్రవరి 10: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో టెన్త్, ఇంటర్ పరీక్షలు రాయబోయే అభ్యర్థులు తమ పరీక్షల ఫీజుల చెల్లింపునకు అపరాధ రుసుముతో ఈ నెల 21 వరకు గడువు పొడిగించినట్లు జూలూరుపాడు పాఠశాల కోఆర్డినేటర్ టీ.లక్ష్మీనర్సయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెన్త్ విద్యార్థులు సబ్జెక్టుకు రూ.100, ఇంటర్ విద్యార్థులు సబ్జెక్టుకు రూ.150 చెల్లించాలన్నారు.

### క్రికెట్ పోటీలు ప్రారంభం

జూలూరుపాడు, ఫిబ్రవరి 10: ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మూడు మండలాల స్థాయి క్రికెట్ పోటీలను సీపీఐ జిల్లా కార్యదర్శి షాబీర్‌పాషా శనివారం ప్రారంభించారు.

### ఘన సన్మానం

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 10 : సింగరేణి అధికారుల సంఘం ఎన్నికల్లో సింగరేణి బ్రాంచ్ అధ్యక్షునిగా ఎనికైన లక్ష్మీపతిగౌడ్‌ని ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు శివప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం మణుగూరులో కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

### ఇసుక లారీలు పట్టివేత

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 10 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను బూర్గంపహాడ్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. ఎస్సై రాజ్‌కుమార్ ఏఎస్సై సత్యనారాయణ, సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేస్తుండగా ఆంధ్రప్రదేశ్ నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక లారీలను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### రేపు అవగాహన సదస్సు

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 10: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన అమలుకు గాను జిల్లా కేంద్రంలోని ఐడీవోసీలో ఈ నెల 12న మధ్యాహ్నం 3 గంటలకు జిల్లాస్థాయి అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సీతారాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరింత సమాచారం కోసం 9502875115ను సంప్రదించాలని కోరారు.

### పేద మహిళకు కుట్టుమిషన్ పంపిణీ

పాల్వంచ, ఫిబ్రవరి 10: మండలంలోని కిన్నెరసాని గ్రామానికి చెందిన పేద వితంతు మహిళ నిర్మలకు బాపూజీనగర్‌కు చెందిన యేసు కరుణాసువార్త మందిరం స్వచ్ఛంద సేవా సంస్థ బాధ్యులు కుట్టు మిషన్ పంపిణీ చేశారు. ప్రభుదాస్, సురేశ్ పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి విరాళం

పాల్వంచ, ఫిబ్రవరి 10: మండలంలోని సోములగూడెంలో రామమందిరం నిర్మాణానికి కమిటీ ఏర్పాటు చేసుకొని గ్రామస్తులు విరాళాలు సేకరిస్తున్నారు. విషయం తెలుసుకున్న బసవతారకం కాలనీకి చెందిన మీ సేవా నిర్వాహకుడు సునావత్ ప్రసాద్ తనవంతు సాయంగా రూ.10 వేలను విరాళంగా అందజేశారు.

## అన్నదాన పథకానికి వితరణ

భద్రాచలం, ఫిబ్రవరి 10 : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అన్నదాన పథకానికి హన్మకొండలోని ప్రగతినగర్‌కు చెందిన వాకా సత్యనారాయణ, జయలలిత దంపతులు రూ.1,01,116 విరాళంగా అందజేశారు. శనివారం రామయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం అధికారి లింగాల సాయిబాబాకు డబ్బులను అందజేసి రశీదు స్వీకరించారు.

## బంగారు ఆభరణాలు సమర్పణ

సీతారామచంద్ర స్వామివారికి హైదరాబాద్‌కు చెందిన పెండ్యాల వెంకటరమణ మిశ్రమ బంగారు గొలుసు, మిశ్రమ బంగారు సూత్రాలు, వెండి మిశ్రమ జంధ్యాలు సమర్పించారు. శనివారం అధికారి లింగాల సాయిబాబాకు రూ.2.30 లక్షలతో తయారు చేయించిన ఆభరణాలను అందజేశారు.

## అధికారులు బాధ్యతగా పనిచేయాలి : ఎస్పీ


సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం క్రైం, ఫిబ్రవరి 10: కేసుల సత్వర పరిష్కారానికి కోర్టు డ్యూటీ అధికారులు బాధ్యతగా పని చేయాలని ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. జిల్లా పోలీస్ విభాగంలో పని చేస్తున్న కోర్టు డ్యూటీ అధికారులతో శనివారం తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలుపుతూ, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, సీఐలు వెంకటేశ్వర్లు, రమాకాంత్, మడిపెల్లి నాగరాజు, టీ.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## బాలాజీ వేంకటేశ్వరస్వామి కల్యాణం

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 10: మండల కేంద్రంలోని బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవ వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పురోహితుడు ప్రసాదాచార్యులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు.

## గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 10 : గంజాయి వాడకం, విక్రయాలపై ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేశామని మణుగూరు సీఐ రమాకాంత్ హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శనివారం రాజుపేట శ్మశానవాటిక వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులను ఆపి సోదా చేయగా వారి వద్ద 50 గ్రాముల గంజాయి, సిగరెట్ ప్యాకెట్లు దొరికాయి. వారిని విచారించగా అశ్వాపురంలో కొనుగోలు చేశామని తెలపగా.. అక్కడికి వెళ్లి విచారించడంతో మరో ఇద్దరి వద్ద గంజాయి లభ్యమైందని సీఐ తెలిపారు. మొత్తం ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

## ఉద్యోగుల సేవా దృక్పథం అభినందనీయం

మణుగూరుటౌన్, ఫిబ్రవరి10: సింగరేణి ఏరియా సివిల్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగుల సేవా దృక్పథం అభినందనీయమని ఏజీఎం (సివిల్) వెంకటేశ్వర్లు అన్నారు. కొన్నేళ్లుగా సింగరేణి ప్రైవేటు కంపెనీలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు కంటిచూపు కోల్పోయిన దానబోయిన సాంబశివరావుకు సివిల్ డిపార్ట్‌మెంటు ఉద్యోగులు, అధికారులు, కాంట్రాక్టర్లు కలిసి రూ.15 వేలను శనివారం అందజేశారు.

## గొల్లకొత్తూరులో వైద్యశిబిరం

మణుగూరుటౌన్, ఫిబ్రవరి10: సింగరేణి సేవాసమితి, సింగరేణి వైద్యవిభాగం సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని గొల్లకొత్తూరులో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. మణుగూరు ఏరియా ఆస్పత్రి వైద్యుడు జె.ఏ.రవికుమార్ 85 మందికి వైద్యసేవలు అందించి మందులు పంపిణీ చేశారు.

## పూజారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా అచ్చానాయక్

పాల్వంచ, ఫిబ్రవరి 10: మున్సిపాలిటీలోని పాల్వంచ కరకవాగు గ్రామంలో తేజావత్ రాములు నివాసంలో జగదాంబ మేడారం భద్రకాళి పూజారుల సంఘం సమావేశం శనివారం జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షుడిగా భూక్యా అచ్చానాయక్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు తేజావత్ రాములు నాయక్.. అచ్చానాయక్‌కు నియామక పత్రాన్ని అందించారు.

## 'బ్రిలియంట్'లో ప్రయోగశాలలు ప్రారంభం

సారపాక, ఫిబ్రవరి 10: సారపాకలోని బ్రిలియంట్ జూనియర్ కళాశాలలో ప్రయోగశాలలను విద్యాసంస్థల చైర్మన్ బీఎస్‌ఆర్ శనివారం ప్రారంభించారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ ప్రయోగశాలలను ప్రారంభించినట్లు తెలిపారు.

## బస్‌షెల్టర్ ఏర్పాటుకు స్థలం గుర్తింపు

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 10: మండలంలోని అంజనాపురంలో ప్రజలు, ప్రయాణికుల సౌకర్యార్థం ఐటీసీ పీఎస్‌పీడీ నిర్మించ తలపెట్టిన బస్‌షెల్టర్ నిర్మాణానికి శనివారం ఐటీసీ అధికారులు, లక్ష్మీపురం ఉపసర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి స్థలాన్ని గుర్తించారు. బస్‌షెల్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చిన ఐటీసీ యూనిట్ హెడ్ సిద్ధార్థ మహంతి, శ్యాంకిరణ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎన్‌సీసీ కేడెట్లకు బ్యాడ్జీలు అందజేత

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 10: మండలంలోని శ్రీరామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 'పిల్లల కోసం తొలిమెట్టు' కార్యక్రమంలో భాగంగా ఎన్‌సీసీ కేడెట్లకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ హవీలా శనివారం బ్యాడ్జీలు, పుస్తకాలను అందజేశారు. డీఈవో వెంకటేశ్వరచారి, వెంకటేశ్వర్లు, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని 13 గొర్రెలు మృతి

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 10: లారీ ఢీకొని గొర్రెలు మృతిచెందిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బూర్గుడెకి చెందిన రొంటె మునేశ్ గొర్రెలను శనివారం సాయంత్రం ఇంటికి తోలుకొని వస్తుండగా కొత్తగూడెం వైపు నుంచి వస్తున్న లారీ అదుపు తప్పి గొర్రెల మందను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 13 గొర్రెలు మృతిచెందాయి. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎసై షాహీనా తెలిపారు.

## ఐఎన్‌టీయూసీ నాయకుడి ఆత్మహత్యాయత్నం

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 10: ఐఎన్‌టీయూసీ నాయకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఇల్లెందు పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన లింగాల జగన్నాథం ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో యూనియన్ పెద్దలు అతడి స్థానంలో మరొకరిని నియమించారు. దీంతో మనస్థాపం చెందిన ఆయన.. ఇంట్లో ఉన్న టాబ్లెట్స్ వేసుకోవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు గమనించి వెంటనే అతడిని వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉండడంతో కొత్తగూడెం సింగరేణి వైద్యశాలకు రిఫర్ చేశారు.